క్లుప్తంగా

నేడు ప్రభల తీర్థం

అమలాపురం టౌన్‌: స్థానిక వంటెద్దువారివీ.ధిలో వేంచేసి యున్న శ్రీగనికమ్మ ఆలయం వద్ద సంక్రాంతి రోజు మంగళవారం ప్రభల తీర్థం నిర్వహించేందుకు గనికమ్మ అమ్మవారి సేవా సమితి ఏర్పాట్లు పూర్తి చేసింది. ఏటా సంక్రాంతి నాడు ఈ ఆలయం వద్ద ప్రభల తీర్థం నిర్వహించడం అనాదిగా వస్తోందని ఆ సమితి ప్రతినిధులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని సమితి ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

ఆకట్టుకున్న పుష్పాలంకరణ



అమలాపురంలో దేవీ ఆలయం వెలుపల పూలతో అలంకరణ

అమలాపురం టౌన్‌: సంక్రాంతి పండగను పురస్కరించుకుని స్థానిక శ్రీదేవి మార్కెట్‌లోని దేవీ ఆలయాన్ని పూలతో చేసిన అలంకరణ చూపరులను ఆకట్టుకుంది. ఆలయంలోని అమ్మవారినే కాకుండా ఆలయమంతా పూల దండలతో అలంకరించారు. భోగి సందర్భంగా అమ్మవారిని వేలాది మంది దర్శించుకున్నారు.

మెల్విన్‌ జోన్స్‌కు నివాళి



మెల్విన్‌ జోన్స్‌ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న అమలాపురం లయన్స్‌ ప్రతినిధులు

అమలాపురం టౌన్‌: లయన్స్‌ ఇంటర్నేషనల్‌ ఫౌండర్‌ మెల్విన్‌ జోన్స్‌ 146వ జయంతి కార్యక్రమం అమలాపురం లయన్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో స్థానిక లయన్స్‌ కమ్యూనిటీ హాలులో సోమవారం ఘనంగా జరిగింది. లయన్స్‌ క్లబ్‌ అధ్యక్షుడు రవణం వేణుగోపాలరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కమెల్విన్‌ జోన్స్‌ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. జయంతి కార్యక్రమానికి లయన్స్‌ రాష్ట్ర నాయకుడు అనిల్‌ కుమార్‌ జైన్‌ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో లయన్స్‌ జోన్‌ చైర్మన్‌ జీవీఎస్‌ మల్లిబాబు, క్లబ్‌ కార్యదర్శి ఎం.వెంకటేశ్వరరావు, లయన్స్‌ ప్రతినిధులు చిక్కాల సతీష్‌, సూదా గణపతి, యల్లమిల్లి విశ్వేశ్వరరావు తదితరులు మెల్విన్‌ జోన్స్‌ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

ఉత్సాహంగా వాలీబాల్‌ పోటీలు

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవులో జరుగుతున్న జిల్లాస్థాయి వాలీబాల్‌ పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. స్థానిక రిజిస్ట్రార్‌ కార్యాలయం ఎదురుగా గల స్థలంలో ముమ్మిడివరం మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ కుడుపూడి శివన్నారాయణ ఆధ్వర్యంలో పోటీలను నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

వాహన చోదకులు నిబంధనలు పాటించాలి

యానాం: వాహన చోదకులు ట్రాఫిక్‌ నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చునని ఎస్పీ రాజశేఖరన్‌ పేర్కొన్నారు. సోమవారం స్థానిక కొత్త బస్టాండ్‌ సెంటర్‌లో రోడ్డు భద్రతా మాసోత్సవాన్ని పురస్కరించుకుని ఉచిత కంటి వైద్యశిబిరం, ఆరోగ్య శిబిరం, ఆటో ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ ధరించాలని, ఆటోడ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం ద్వారా ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. అంతకుముందు పట్టణంలో పలు వీధుల గుండా ఆటోలతో భారీ ర్యాలీని నిర్వహించారు. ఆర్టీవో కాటే ప్రభాకరావు, ట్రాఫిక్‌ ఎస్సై నూక రాజు, రిటైర్డ్‌ సీఐ శివగణేష్‌ పాల్గొన్నారు.

నేత్రదానంతో అంధుల జీవితాల్లో వెలుగు

తాళ్లరేవు: నేత్రదానం చేయడం ద్వారా అంధత్వంతో బాధ పడుతున్న మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపవచ్చని సామాజిక కార్యకర్త ధూళిపూడి వెంకటరమణ అన్నారు. పి.మల్లవరం గ్రామానికి చెందిన ఖండవిల్లి సూర్యాకాంతం(90) మృతి చెందారు. మృతురాలి కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించి నేత్రదానానికి ఒప్పించినట్లు తెలిపారు. కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంకు టెక్నీషియన్‌లు రవి, కె.నానిలు సూర్యకాంతం కార్నియాలను సేకరించారు. కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ముమ్మిడివరం: ముమ్మిడివరం బైపాస్‌ రోడ్డులోని టీడీపీ కార్యాలయం ఎదురుగా మోటారు సైకిల్‌పై తన భార్య, కుమార్తెతో కలిసి రోడ్డు దాటుతున్న వ్యక్తిని వేగంగా వస్తున్న మరో మోటారు సైకిల్‌ ఢీకొట్టడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ముమ్మిడివరం నగర పంచాయతీలో పని చేస్తున్న అరిగెల సత్తిబాబు అతని భార్య, కుమార్తెతో కలిసి గుడికి వెళ్లి వస్తూ టీడీపీ కార్యాలయం వద్ద రోడ్డు దాటుతుండగా అనాతవరానికి చెందిన బీర ప్రవీణ్‌ సీబీజెడ్‌ మోటారు సైకిల్‌పై వేగంగా వస్తూ వారిని ఢీకొట్టాడు. గాయపడిన వారిని ముమ్మిడివరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

కాలు దువ్విన పందెం కోడి

- మురమళ్లలో పెద్ద ఎత్తున పందేల నిర్వహణ
- మొదటి రోజు లావాదేవీలు రూ.15కోట్లు పైమాటే
- క్రికెట్‌ స్టేడియాన్ని తలపించేలా ఏర్పాట్లు
- హాజరైన అధికార పార్టీ నాయకులు



మురమళ్లలో భారీ సెట్టింగుల మధ్య కోడి పందేలు



ప్రత్యేక గ్యాలరీలలో కూర్చొని వీక్షిస్తున్న ప్రజలు



అల్లవరం మండలంలో యథేచ్ఛగా సాగిన గుండాట

ఐ.పోలవరం: సంక్రాంతి పండగ నేపథ్యంలో ఐ.పోలవరం మండలంలోని మురమళ్లలో సోమవారం క్రికెట్‌ స్టేడియాన్ని తలపించేలా ఏర్పాట్లు చేసి కోడి పందాలు, గుండాటలు పెద్ద ఎత్తున నిర్వహించారు. ఎల్‌ఈడీ స్క్రీన్లు, వీఐపీ గ్యాలరీలు, కోనసీమ వంటకాలు, తినుబండారాల మధ్య భారీ స్థాయిలో కోడి పందేలు జరిగాయి. మురమళ్లలో మూడు కోడి పందాల బరులు ఏర్పాటు చేశారు. భారీ టెంట్లు, ఐరెన్‌ మెస్‌లతో కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య పందాలు నిర్వహించారు. పందెం రాయుళ్లు కోడి పందాలలో చురుగ్గా పాల్గొని లక్షల రూపాయల పందేలు కాశారు. జూద క్రీడలకు రాష్ట్ర స్థాయిలో పేరుగాంచిన మురమళ్లలో కోడి పందాలు ఏర్పాటు చేయడంతో పెద్ద పందాలు కట్టే జూదం రాయుళ్లకు ప్రత్యేక వసతులు కల్పించారు. వీఐపీ గ్యాలరీలు, వచ్చిన అతిథులకు పిండి వంటకాలు, పళ్లు, మినరల్‌ వాటర్‌ బాటిళ్లను నిర్వాహకులు సిద్ధం చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వీడియో కెమేరాలు ఏర్పాటు చేశారు. గుండాట సైతం భారీ స్థాయిలో జరిగింది. సంక్రాంతి పండగ తొలిరోజు మండలంలో కోడి పందాలు, గుండాటల ద్వారా రూ. 15 కోట్ల వరకు చేతులు మారినట్లు అంచనా. మరో రెండు రోజులు పండగ ఉండటంతో మండలంలో రూ.50 కోట్ల వరకూ ఈ పందాలలో చేతులు మారతాయని భావిస్తున్నారు. ఈ పందాలను వీక్షించేందుకు సుదూర ప్రాంతాల నుంచి మహిళలు సైతం వచ్చారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్‌ దాట్ల సుబ్బరాజు, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానందలు వీఐపీ గ్యాలరీలో కూర్చొని పందాలను ఆసక్తిగా తిలకించారు. వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మండలంలోని చల్లపల్లి, ఎస్‌.యానం, ఎన్‌.కొత్తపల్లి, గాడవిల్లి, గొల్లవిల్లి, భీమనపల్లి గ్రామాల్లో భారీ బరులతో కోడి పందాలను కత్తి కట్టి నిర్వహిస్తున్నారు. బరుల ఆవరణలో గుండాట, పేకాట వంటి జూదాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి.

అల్లవరం: సంక్రాంతి పండగ నేపథ్యంలో మండల వ్యాప్తంగా ఏడు బరుల్లో కోడి పందాలు కూటమి నేతల ఆధ్వర్యంలో నిర్వహించారు. కోడూరుపాడు పంచాయతీ పరిధిలోని దేశికోడు వంతెన, ఆకులవారిపాలెం, గుత్తులవారిపాలెం ప్రాంతాల్లో కోడి పందేలు, గుండాట జోరుగా సాగాయి. అల్లవరం సడక్‌ రోడ్డు, దేవగుప్తం, తూర్పులంక, రెల్లుగడ్డ గ్రామాల్లో కోడి పందేలు జరిగాయి. కోడూరుపాడులోని ఆకుల వారిపాలెంలో కొత్తగా వేసిన పందెం బరిని సోమవారం సాయంత్రానికి మూసేశారు. టీడీపీలోని ప్రధాన నాయకత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పందెం బరి ఖాళీగా దర్శనమిచ్చింది తూర్పులంకలో ఈ ఏడాది కొత్తగా పందెం బరి ఏర్పాటు చేశారు. రెల్లుగడ్డలో కోడి పందేలు నిర్వహించరాదని స్థానిక సర్పంచ్‌ నడింపల్లి వాసురాజు జిల్లా కలెక్టర్‌, ఎస్పీకి ఫిర్యాదు చేసినా ఏమాత్రం ఖాతరు చేయకుండా యథేచ్ఛగా పందేలు జరిగాయి.

జోరుగా పందేలు



ముమ్మిడివరం మండలం రాజుపాలెంలో కోడి పందేలు ప్రారంభిస్తున్న జూదరులు

ముమ్మిడివరం: ప్రజా ప్రతినిధుల అండ దండలతో నిర్వాహకులు నిర్భయంగా పందేలు నిర్వహించారు. రాజకీయ పైరవీలతో ఈసారి కూడా పోలీసులపై పందెం రాయుళ్లే గెలిచారు. సంక్రాంతి సందర్భంగా తొలిరోజు సోమవారం పలు గ్రామాల్లో ఉదయం నుంచి పందాలు నిర్వహించేందుకు సమాయాత్తమయ్యారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరికలు చేసినప్పటికీ రాజకీయ నాయకుల అండదండలతో పందెం రాయుళ్లదే పైచేయి అయ్యింది. పోలీసులు మొదటి రోజు నామమాత్రపు దాడులు చేసి కోడి పుంజులు తరలిస్తున్న పలువురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. కేసులు నమోదు చేసిన పోలీసులు చివరకు రాజకీయ నాయకుల వొత్తిళ్లకు తలొగ్గక తప్పలేదు. మంగళ, బుధవారాల్లో పందేల రాయుళ్ల రెట్టించిన ఉత్సాహంతో యథేచ్ఛగా పందాలు నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారు. కొడి పందాలతో పాటు గుండాట, పేకాట, పెద్ద ఎత్తున జరిగాయి. ముమ్మిడివరం మండలం రాజుపాలెం,అన్నంపల్లి, గేదిల్లంక, కొత్తలంక ఐ.పోలవరం మండలం మురమళ్ల, ఎదుర్లంక, కేశన కుర్రు, ఐ.పోలవరం, కొమరగిరి, గుత్తెనదీవి, కాట్రేనికోన మండలం చెయ్యేరు, గెద్దనాపల్లి, పల్లంకుర్రు, తాళ్లరేవు తీర గ్రామాలలో పందాలు జోరుగా సాగాయి.

భోగి తెచ్చె భోగం

- వాడవాడలా కనువిందు చేసిన భోగి మంటలు
- సందడి చేసిన యువకులు
- పల్లెలకు పండగ శోభ



కనకాలపేటలో రంగవల్లుల పోటీలు



అమలాపురంలో భోగి మంటను వెలిగించి కోనసీమ సంక్రాంతి సంబరాలను ప్రారంభిస్తున్న డాక్టర్‌ వెంకటేశ్వరరావు దంపతులు



అల్లవరంలో 200 అడుగుల పొడవు పిడకల దండను ఊరేగిస్తున్న ఆర్యవైశ్యులు

ఉప్పలగుప్తం: గ్రామాల్లో భోగి మంటలు కనువిందు చేశాయి. చీకటిని పారద్రోలి వెలుగును ప్రసరింపజేసే భోగి మంటల వద్ద పెద్దా, చిన్నా తారతమ్యాలు మరచి అంతా ఆనందంగా గడిపారు. యువకులు పోటా పోటీగా భోగి మంటలను ఏర్పాటు చేశారు. చిన్నారులు తాము తయారు చేసిన పిడకల దండలను మంటల్లో వేసి ఆనందోత్సాహాలతో గడిపారు.

ఆరంభమైన కోనసీమ సంక్రాంతి సంబరాలు

అమలాపురం టౌన్‌: అమలాపురం హౌసింగ్‌ బోర్డు కాలనీలోని ఎన్‌వీఆర్‌ నగర్‌లో హైదరాబాద్‌, విశాఖ మెట్రో కెమ్‌ కంపెనీల అధినేత డాక్టర్‌ నందెపు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం వేకువ జామున కోనసీమ సంక్రాంతి సంబరాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఎన్‌వీఆర్‌ నగర్‌ను ఓ సంప్రదాయ పల్లె మాదిరిగా సెట్టింగ్‌లతో తీర్చిదిద్దారు. తొలుత భోగి మంటను వెలిగించడం ద్వారా సంక్రాంతి సంబరాలకు డాక్టర్‌ వెంకటేశ్వరావు దంపతులు శ్రీకారం చుట్టారు. కత్తులు లేని కోడి పందేల బరిలో కోళ్లు నువ్వా నేనా అన్నట్లుగా తలపడ్డాయి. కోలాటాలు, హరిదాసులు, గంగిరెద్దులు, సోదెమ్మలు, కొమ్మదాసులు, జంగమయ్యలు ఇలా సంక్రాంతి పండగలతో మిళితమైన సంప్రదాయాలన్నీ ఇక్కడ ప్రదర్శితమయ్యాయి. సంబరాలను తిలకించేందుకు వేలాది మంది ప్రజలు ఇక్కడకు చేరుకుని వీక్షించారు. సంప్రదాయ కళలను ప్రదర్శించిన కళాకారులను డాక్టర్‌ వెంకటేశ్వరరావు ఘనంగా సత్కరించారు.

భక్తి శ్రద్ధలతో భోగి

ముమ్మిడివరం: భోగి పండగను సోమవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కొత్త సంవత్సరంలోకి అడుగు పెట్టిన వెంటనే వచ్చే తొలి పండగ కావడంతో ఈ పండగను ఊరూవాడా ఏకమై ఘనంగా జరుపుకున్నారు. ఆవు పేడతో తయారు చేసిన పిడక దండలను భోగి మంటల్లో వేసి చిన్నారులు అవధులు లేని ఆనందాన్ని పొందారు. భోగి రోజు సాయంత్రం చిన్నారులకు భోగి పండ్లు వేశారు. రేగి పండ్లను పిల్లల తలమీద పోసి చుట్టు ప్రక్కల వారు, బంధువులను ఆహ్వానించి వాయనాలు ఇచ్చారు.

మొదలైన సంక్రాంతి సంబరాలు

యానాం: నియోజకవర్గ పరిధిలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. సోమవారం స్థానిక కనకాలపేట గ్రామంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో వివిధ పోటీలను నిర్వహించారు. తెల్లవారు జామునే భోగి మంటలు వేశారు. అనంతరం నిర్వహించిన ముగ్గుల పోటీల్లో అధిక సంఖ్యలో మహిళలు, యువతులు ఉత్సాహంగా పాల్గొని రంగురంగుల ముగ్గులను వేశారు. అనంతరం యువకులను స్థానిక హైస్కూల్‌లో వాలీబాల్‌ తదితర పోటీలను నిర్వహించారు. రామన్నకోడు గ్రామంలో శ్రీవర సిద్ధి వినాయకుని ఆలయం వద్ద గ్రామస్తుల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. తెలంగాణా, హైద్రాబాద్‌ నుంచి వచ్చిన వాహనాలతో రాజీవ్‌ రివర్‌బీచ్‌ కిటకిటలాడింది.

అల్లవరం: సంక్రాంతి పండగ తొలి రోజు భోగి సందర్భంగా వాడవాడలా భోగి మంటలను ఏర్పాటు చేశారు. మొగళ్లమూరులోని మాజీ ఎంపీ చింతా అనురాధ ఇంటి వద్ద భోగి మంటలను ఏర్పాటు చేసి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. మాజీ ఎంపీ అనురాధ భోగి మంటలను స్థానికులతో కలసి వెలిగించారు. బెండమూర్లంకలో ఆర్యవైశ్యల ఆధ్వర్యంలో 200 అడుగుల పొడవు గల భోగి పిడకల దండను ఊరేగించి భోగి మంటల్లో వేశారు.

విశ్వరూప్‌ నివాసం వద్ద భోగి వేడుకలు



భట్నవెల్లిలో భోగి మంట వెలిగిస్తున్న మాజీ మంత్రి విశ్వరూప్‌

అమలాపురం రూరల్‌: మండలంలోని భట్నవిల్లి గ్రామంలో వైఎస్సార్‌ సీపీ అంబేడ్కర్‌ కోనసీమ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్‌ నివాసం వద్ద భోగి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వరూప్‌ కుటుంబ సభ్యులతో భోగి మంట వెలిగించి వేడుకల్లో పాల్గొన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఆయన సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు నాయకులు, కార్యకర్తలు విశ్వరూప్‌కు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు వంటెద్దు వెంకన్నాయుడు, దూడల ఫణికుమార్‌, ఈతకోట శ్రావణ్‌, వంగా గిరిజా కుమారి, చిక్కం సూరిబాబు, పేరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాల వికాస్‌ విద్యార్థుల సంక్రాంతి సంబరాలు



బహుమతులు అందుకున్న విజేతలతో డాక్టర్‌ ప్రభాకర్‌

అమలాపురం టౌన్‌: సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో స్థానిక గాంధీనగర్‌ బాల వికాస్‌ విద్యార్థులచే సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా జరిగాయి. సత్యసాయి బాల వికాస్‌కు చెందిన బాలికలు ముగ్గుల పోటీల్లో పాల్గొని రంగవల్లులను తీర్చిదిద్దారు. ముగ్గుల పోటీల్లో దాదాపు 70 మంది బాలికలు పాల్గొని రంగు వల్లులు వేశారు. విజేతలకు సత్యసాయి సేవా సంస్థల అమలాపురం డివిజన్‌ కోఆర్డినేటర్‌ డాక్టర్‌ జి.ప్రభాకర్‌ బహుమతులు అందజేశారు. ముగ్గుల పోటీల్లో ప్రతిభ చూపిన అయిదుగురి బాలికలను ఎంపిక చేసి వారికి బహుమతులు సమకూర్చారు.

వాడవాడలా భోగి మంటలు

అమలాపురం రూరల్‌: భోగభాగ్యాల భోగి పండగను సోమవారం వాడవాడలా ఘనంగా జరుపుకున్నారు. మండలంలో సంక్రాంతి వేడుకలు సోమవారం భోగి పండగతో ప్రారంభమైంది. చిన్నా పెద్దా అంతా పండగ జోష్‌లో మునిగి తేలుతున్నారు. అమలాపురం మండలంలో భోగి పండగ సందర్భంగా ప్రతి వీధిలో పెద్ద ఎత్తున భోగి మంటలు వేశారు. బండార్లంక, కామనగరువు, భట్నవిల్లి, పేరూరు సమనస, చిందాడ గరువుల్లోని వీధుల్లో యువకులు పోటా పోటీగా భోగిమంటలు వేశారు.

వ్యవసాయ కార్మిక సంఘం క్యాలెండర్‌ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు, సంఘ ప్రతినిధులు

అమలాపురం టౌన్‌: ఆంధ్రప్రదేశ్‌ వ్యవసాయ కార్మిక సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు స్థానిక విద్యుత్‌ నగర్‌లో సోమవారం ఆవిష్కరించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు మాట్లాడారు. 2011 నుంచి రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం ముద్రిస్తున్న క్యాలెండర్‌లో ప్రజా ఉద్యమాలకు అద్దం పట్టే చిత్రాలను పొందుపరచడం అభినందనీయమన్నారు. ప్రజా సమస్యలపై పోరాటంతో ముందుకు సాగుతున్న భవిష్యత్‌ కార్యాచరణను ఆయన వివరించారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తాడి శ్రీరామమూర్తి, సంఘ ప్రతినిధులు పొలమూరి శ్రీను, భీమాల శ్రీను, కె.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గోదాదేవి కల్యాణం



మురమళ్లలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో గోదా కల్యాణం



అమలాపురంలో గోదాదేవి, రంగనాథుల కల్యాణాన్ని నిర్వహిస్తున్న భక్తులు

ఉప్పలగుప్తం: భోగి పండగను పురస్కరించుకొని మండలంలోని భీమనపల్లి భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.కార్తీక ఆధ్వర్యంలో గోదాదేవి కల్యాణాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. పురోహితులు పెద్దింటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు చేసి గోదాదేవి అమ్మవారికి స్వామి వారితో కల్యాణాన్ని నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను పూలమాలలతో అందంగా అలంకరించి అన్న సమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఐ.పోలవరం: సంక్రాంతి పర్వదినాల్లో మొదటిదైన భోగి పండగను సోమవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అడుగడుగునా భోగి మంటలు వేసి ఉత్సాహంగా పిల్లలు, పెద్దలు సంబరాలు జరుపుకొన్నారు. వాడవాడలా భోగి మంటలు వేయడంతో తెల్లవారు జాము నుంచి సందడి నెలకొంది. తెలుగు సాంస్కృతీ సంప్రదాయలకు నెలవు సంక్రాంతి పండుగ అని స్థానిక ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. మురమళ్లలో ఆయన కుటుంబ సమేతంగా భోగి పండగలో పాల్గొని సందడి చేశారు. అనంతరం సంప్రదాయ పద్ధతిలో పూజలు నిర్వహించారు. ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల వీరేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిట లాడింది. క్షేత్ర పాలకుడు లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణం వైభవంగా జరిగింది. నెల రోజుల పాటు ఆలయంలో ప్రతి నిత్యం తిరుప్పావైను వైభవంగా నిర్వహించారు.

తాళ్లరేవు: స్థానిక ప్రధాన రహదారిలో వేంచేసి యున్న శ్రీ భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో భోగి పండగ సందర్భంగా గోదాదేవి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఖండవిల్లి కేశవాచార్యులు నేతృత్వంలో గోదాదేవికి విశేష పూజలు చేశారు. అనంతరం అమ్మవారి కల్యాణాన్ని కన్నుల పండువగా జరిపించారు.

అమలాపురం టౌన్‌: భోగి పండగ పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి, రంగనాథుల కల్యాణం సోమవారం వైభవంగా జరిగింది. కొందరు దంపతులు కర్తలుగా కూర్చుని గోదాదేవి కల్యాణాన్ని నిర్వహించారు. అర్చక స్వాముల వేద మంత్రాల నడుమ కల్యాణం కమనీయంగా సాగింది. ఆలయ సిబ్బంది కల్యాణాన్ని పర్యవేక్షించారు.

ముస్తాబైన ప్రభలు

- గగుర్పాటు కలిగించే ఊరేగింపు
- కనుమ పండగకు నిర్వహణ

ముమ్మిడివరం: సంక్రాంతి పర్వదినాల్లో చివరి రోజైన కనుమ పండుగ రోజు స్థానికంగా జరిగే ప్రభల తీర్థానికి ప్రత్యేకత ఉంది. ఈ ప్రాంత ప్రజలు తమ ఆచార వ్యవహారాలను ఈ తీర్థం ద్వారా ఇనుమడింపజేస్తారు. లోక కల్యాణార్థం దక్షకుడు చేసే యజ్ఞానికి పరమశివుడ్ని ఆహ్వానించక పోవడంతో ఆగ్రహానికి లోనవుతాడు పరమ శివుడు. ప్రళయ రుద్రుడై ఆవేశంతో నృత్యం చేస్తూ జటాజూటాన్ని నేలకేసి కొట్టగా కోటి సూర్య కాంతులతో వీరభద్రుడు జన్మిస్తాడు. అలా కోటిసూర్యుల తేజస్సు నుంచి ప్రభ ఉద్భవించింది. ఇది వీరభద్రుని స్వరూపంగా ప్రజలు విశ్వసిస్తారు. ముమ్మిడివరం మండలం పల్లిపాలెం, ఐ.పోలవరం మండలం మొక్క తోట, కాట్రేనికోన మండలం చెయ్యేరు గ్రామాలలో జరిగే ప్రభల తీర్థానికి ప్రత్యేకత ఉంది.

గగుర్పాటు కలిగించే ఊరేగింపు

ప్రభల ఊరేగింపు చూస్తే గగుర్పాటు కలగకమానదు. వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రభలు పంట చేలు, కొబ్బరితోటలు, మురుగునీటి కాలువల మధ్య నుంచి వస్తాయి. దారిలో గొప్పులు, గోతులు ముళ్ల కంచెలు, మురుగునీటి కాలువలు దాటుకుంటూ భక్తులు వీటిని తీర్థ ప్రదేశాలకు తీసుకువచ్చే తీరు చూసి తీరాల్సిందే. పల్లె పాలెంలో నిర్వహించే తీర్థానికి కొమానపల్లి, నడిమి లంక, ముమ్మిడివరం, అగ్రహారం, కొత్తలంక, వడ్డిగూడెం, రాజుపాలెం, చింతలమెరక గ్రామాల నుంచి ప్రభలను తోడ్కొని వస్తారు.



తీర్థ స్థలికి ప్రభలను తోడ్కొని వస్తున్న భక్తులు (ఫైల్‌)

భక్తులతో కిక్కిరిసిన అయినవిల్లి

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయం సంక్రాంతి సందర్భంగా సోమవారం దేశం నలుమూలలు నుంచి అత్యధిక సంఖ్యలో భక్తుల దర్శించుకున్నారు. స్వామికి ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో విశేష పూజలు అభిషేకాలు జరిపారు. స్వామి వారి ఆలయ ప్రాంగణం రంగవల్లులు, వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భోగి మంటలు వేశారు. హరిదాసులు, గారడీ, వివిధ నృత్య ప్రదర్శనలు, డప్పు వ్యాయిద్యాలు ఏర్పాటు చేశారు.